సాక్షి కామారెడ్డి

గురువారం । 8 । జూన్ । 2023



చెరువుల పండుగకు ఏర్పాట్లు

నియోజకవర్గాల్లో ఆయా చెరువుల వద్ద గురువారం పండుగ నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- 9లో ▸



సాగుకు సన్నద్ధం

ఖరీఫ్‌కు అన్నదాతలు సమాయత్తం అవుతున్నారు. పొలాలను ట్రాక్టర్లతో దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
39.5 /30.0

వాతావరణం

ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతం కావచ్చు. వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రేషన్ డీలర్ల సమ్మె విరమణ

- నేటి నుంచి బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్ : రేషన్ డీలర్లతో ప్రభుత్వం చర్చలు సఫలం కావడంతో ఈనెల 8 నుంచి రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించనున్నట్లు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గారిశెట్టి రాజు తెలిపారు. జూన్ 5వ తేదీ నుంచి గౌరవ వేతనంతో పాటు ఇతర 22 డిమాండ్లతో కూడిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రేషన్ డీలర్లు సమ్మెకు పిలుపునివ్వగా ఈనెల 6న పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ రేషన్ డీలర్లతో చర్చలు జరిపి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే బుధవారం 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను సెక్రటరీయేట్‌కు పిలుపించుకుని వారి ముందే హామీ ఇవ్వడంతో వారు సమ్మె విరమిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో బియ్యం పంపిణీ గురువారం నుంచి ప్రారంభం కానుంది.

నేడు దోస్త్ స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల్లో భాగంగా దోస్త్- 2023 స్పెషల్ కేటగిరికి సంబంధించిన పీహెచ్/ సీఏపీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ గురువారం(8న) నిర్వహించనున్నట్లు తెయూ దోస్త్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా భవనంలోని డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్స్ పరిశీలన జరుగుతుందన్నారు. అలాగే జూన్ 9న ఎన్‌సీసీ/ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటిస్ కలిగిన విద్యార్థులు సర్టిఫికెషన్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు www.telanganauniversity.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు (ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ)-2024 శిక్షణ కోసం కోసం ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షల లోపు ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్ రాజేంద్రనగర్ గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఉచిత భోజన వసతి,శిక్షణ ఇస్తారన్నారు. 6281766534లో సంప్రదించాలన్నారు.

ఓడిపోతామనే భయంతోనే దశాబ్ది ఉత్సవాలు



బిచ్కుంద(జుక్కల్) : సర్వేలు చేసుకొని ఓడిపోతున్నామనే భయంతో బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలతో ప్రజలకు మభ్యపెట్టి పార్టీ ప్రచారాలు చేసుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార విమర్శించారు. బుధవారం రాజుల్లాలో బీజేపీ గడప గడపకు ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకొని తామే చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఉచిత రేషన్ బియ్యం ఎన్నో సంక్షేమ పథకాలు పేదల కోసం అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కిష్టారెడ్డి, శ్రీధర్ పంతులు, పండరి జాదవ్, ప్రవీన్, సంజువ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

639 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో బుధవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 639 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. 16 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 4,50,778 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 65,988 మందికి అద్దాలను పంపిణీ చేశారు.

వేలం వెర్రి..!

బెల్ట్ షాపులే అక్రమం. ఆపై వాటికి దర్జాగా వేలం పాట నిర్వహించడం లాంటి వ్యవహారాలతో వ్యవస్థల మీద ప్రజలకు నమ్మకం పోతోంది. గ్రామాల్లో బహిరంగంగా వేలం పాట నిర్వహిస్తున్నప్పటికీ పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల అధికారులు కళ్లు మూసుకోవడం విస్మయం కలిగిస్తోంది. అన్ని రకాల నేరాలకు మద్యమే కారణమవుతోంది.

- నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులకు బహిరంగ వేలం
- కళ్లు మూసుకున్న యంత్రాంగం
- ఊరూరా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



సాక్షి, కామారెడ్డి : రోడ్డు ప్రమాదాలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు.. ప్రతీది మద్యం మత్తులోనే జరుగుతున్నాయని అధికారులే చెబుతున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తున్నారు. మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుంటే మాత్రం పట్టించుకోరు. చట్ట విరుద్ధంగా వేలం పాటలు నిర్వహిస్తుంటే అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు వెళ్లడం లేదు. అంటే పరోక్షంగా సహకరిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

అడ్డగోలు ధరలు..

ఇప్పటికే మద్యం ధరలు అడ్డగోలుగా పెరిగి మద్యం ప్రియులు ఇబ్బంది పడుతుంటే, బెల్ట్‌షాపుల నిర్వాహకులు మరింత పెంచి అమ్ముతున్నారు. మద్యం దుకాణాల్లో ప్రింటెడ్ ధరకు అమ్ముతుండగా, బెల్ట్ షాపుల్లో క్వార్టర్‌పై రూ.20, హాఫ్ బాటిల్‌పై రూ.40, ఫుల్ బాటిల్‌పై రూ. 100 వరకు అదనంగా తీసుకుంటున్నారు. బీర్లు కూడా రూ.20 నుంచి రూ.40 వరకు అదనంగా తీసుకుంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడంటే అప్పుడు మద్యం దొరుకుతోంది. ధర ఎక్కువైనా సరే దొరికితే చాలన్న భావనతో మందుబాబులు కొంటున్నారు.

ఎన్నికల ఏడాది కావడంతో..

ఎన్నికల సీజన్ కావడంతో బెల్ట్ షాపులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. తర్వాత పార్లమెంట్ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మద్యం అమ్మకాలు భారీగా పెరుగుతాయి. ఈ నేపథ్యంలో బెల్ట్ షాపులకు పోటీ పడుతున్నారు. ఏ ఊళ్లో వేలం వేసినా పోటాపోటీగా వేలం పాడి దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామ దేవతలకు పండుగలు, కుల దేవతలకు పండుగలు, సాధారణ పండుగలు, ఆదివారాలు, విందులు, ఇంకా.. నలుగురు దోస్తులు కలిస్తే చాలు మందు తాగాలన్న ఆరాటం పెరిగిపోయింది. దీంతో మద్యం అమ్మకాలు భారీ ఎత్తున సాగుతున్నాయి.

మండల కేంద్రంలోనో, పట్టణంలో ఉన్న మద్యం దుకాణాలకు వెళ్తే ప్రింట్ ధరలకు మద్యం దొరుకుతుంది. అయితే అంతదూరం వెళ్లి రావడం కన్నా ఉన్న ఊళ్లో బెల్ట్ షాపులో కాస్త డబ్బులు ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారు. దీంతో బెల్ట్ షాపులకు ఏడాదికేడాది డిమాండ్ పెరుగుతోంది.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని..

మద్యం అమ్మకాల కోసం బెల్ట్ షాపులను ఏర్పాటు చేయడం, వాటికి బహిరంగవేలం నిర్వహిస్తున్న విషయం తెలిసినా యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వేలం నిర్వహిస్తున్నా నోరు మెదపకపోవడం విస్మయం కలిగిస్తోంది. గ్రామాల్లో రాత్రింబవళ్లు బెల్ట్ షాప్‌లు తెరిచే ఉంటున్నాయి. మద్యం దుకాణాలకు కనీస సమయాలు నిర్దేశించారు. కానీ బెల్ట్‌షాపుల నిర్వాహకులు అవేమి పాటించే పరిస్థితుల్లో లేరు. దీంతో మద్యం తాగేవాళ్లకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటోంది. మద్యం మత్తులో గొడవలు జరుగుతున్నాయి. ఆర్థికంగా చితికిపోతున్నారు. ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం కళ్లు తెరవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భిక్కనూరులోని జంగంపల్లిలో..

44వ నంబరు జాతీయ రహదారిపై భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో బెల్ట్ షాప్ కోసం బహిరంగవేలం నిర్వహించారు. వందలాది మంది గ్రామస్తులు పాల్గొన్నారు. రూ.19.85 లక్షలకు పాడి బెల్ట్ షాప్‌ను దక్కించుకున్నారు. దాదాపు అన్ని మండలాల్లోనూ బెల్ట్ షాపులకు వేలం పాటలు నిర్వహిస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో వేలం నిర్వహించి డబ్బులను గ్రామ అవసరాలకు వినియోగిస్తున్నారు. లింగంపేట, మాచారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్, బాన్సువాడ, పిట్లం తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమయంలో వేలం పాటలు నిర్వహిస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల నుంచి..

బెల్ట్ షాపులే అడ్డాగా నకిలీ మద్యం అమ్మకాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. బెల్ట్ షాపుల నిర్వాహకులే నకిలీ మద్యం అమ్మకాలు సాగిస్తున్నట్టు స్పష్టమవుతోంది. అలాగే పొరుగు రాష్ట్రాలకు చెందిన నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లు కూడా అమ్ముతున్నారు. పొరుగు మద్యంతో పాటు నకిలీ మద్యం అమ్మకాలతో ప్రభుత్వ ఖజానాకు కూడా గండిపడుతోంది. అప్పుడప్పుడు నకిలీ మద్యం, పొరుగు రాష్ట్రాల మద్యం బాటిళ్లు వెలుగు చూస్తున్నాయి. మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ నియంత్రణ లేకపోవడం వల్లే అక్రమాలకు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక



కామారెడ్డి క్రైం : కామారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం లక్కీ డ్రా ద్వారా 3, 5, 8 తరగతుల్లో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కోసం 45 మంది గిరిజన విద్యార్థుల ఎంపిక చేపట్టారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు. మూడవ తరగతికి 15 మంది బాలురు, 8 మంది బాలికలను ఎంపిక చేశారు. 5వ తరగతికి ఏడుగురు బాలురు, నలుగురు బాలికల ఎంపిక చేశారు. 8వ తరగతికి ఏడుగురు బాలురు, నలుగురు బాలికలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేయాలి

కామారెడ్డి క్రైం : తమ క్లస్టర్ పరిధిలో వర్షాధారంగా పండే పంటల విస్తీర్ణ వివరాలను ఏఈవోలు అంచనా వేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులతో పంటల విస్తీర్ణంపై సమీక్ష నిర్వహించారు. వర్షాధారంగా, చెరువు, బావులు, బోర్లు, ప్రాజెక్టుల కింద సాగు చేసే పంటల విస్తీర్ణాన్ని అంచనా వేసి నివేదికలు తయారు చేయాలన్నారు. వేసిన పంటల వివరాలు నమోదు చేయాలని చెప్పారు. గ్రామాల్లో రైతుబంధు సమితి ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ఏడీఏలు రత్న, అపర్ణ, ప్రసన్న, నూతన కుమార్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లా.. పేకమేడలా?

- కాంట్రాక్టర్ల నుంచి బిల్లులు రికవరీ చేయాలి
- దింపుడు కల్లం సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



టేక్రియాల్ వద్ద డబుల్ బెడ్‌రూం నాణ్యత లోపాన్ని చూపిస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్ : జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు అన్నీ నాసిరకంగా నిర్మాణాలు చేపట్టారని, వెంటనే కాంట్రాక్టర్ల నుంచి బిల్లులు రికవరీ చేయాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి జిల్లా కేంద్రం పరిధిలోని టేక్రియాల్ బైపాస్ పక్కన నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాసిరకంగా, ఎప్పుడు కూలుతాయో ఏమో అన్నట్లు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఉన్నాయన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఎంపికైన లబ్ధిదారుల జాబితాపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పట్టణంలో 23,476 మంది ఇళ్లకోసం పేదలు దరఖాస్తులు చేసుకున్నారని, నియోజకవర్గంలోనే కేవలం 1715 మందికి కేటాయించగా అందులో అధికార పార్టీ కార్యకర్తలే ఎక్కువున్నారన్నారు. సొంత స్థలాలు ఉన్నవారికి ఇస్తామన్న రూ. 3లక్షలు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయే రోజులు దగ్గరపడ్డాయని, అందుకే ఇప్పుడు దింపుడు కల్లం సంబురాలు చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇళ్లు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు ఐరేని సందీప్, పండ్ల రాజు, గుడుగుల శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, భీమ్ రెడ్డి, సిరాజుద్దీన్, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులున్నారు.

కాళేశ్వరంతో సాగుకు ఢోకాలేదు

- ముందుచూపుతోనే సీఎం ప్రాజెక్ట్ నిర్మించారు
- కాళేశ్వరం లేకపోతే నిజాంసాగర్ ప్రాజెక్ట్ బోసిపోయేది
- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్



ఇరిగేషన్ అధికారులకు జ్ఞాపికలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్

కామారెడ్డి రూరల్ : కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంతో సాగునీటికి ఇబ్బంది లేకుండా రైతులకు ఎంతో మేలు జరిగిందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. బుధవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ శివారులోని బృందావన్ గార్డెన్‌లో బుధవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో నిజాంసాగర్ ప్రాజెక్ట్ తెలంగాణ రాకముందు నీళ్లులేక బోసిపోయేదని, కాళేశ్వరం జలాలు రాకతో నిజాంసాగర్ ఆయకట్టు సస్యశ్యామలమైందన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో 90 ఫీట్ల లోతునుంచి 600 ఫీట్ల ఎత్తుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తీసుకొచ్చి చెరువులను నింపుతున్నారన్నారు. 60 ఏళ్ల పాలించిన పాలకులు తట్టెడు మట్టిని కూడా చెరువుల నుంచి తీయించలేదని అన్నారు. సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ పేరుతో చెరువుల మరమ్మతులు చేపట్టారన్నారు. గతంలో చెరువుల కింద వానకాలం పంటలు మాత్రమే సాగయ్యేవని ప్రస్తుతం రెండు పంటలు సాగవుతున్నాయని అన్నారు. త్వరలోనే కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని చెరువులకు కాళేశ్వరం జలాలు వస్తాయన్నారు. కేవలం రాష్ట్రంలోనే వందశాతం చెరువుల మరమ్మత్తులు చేపడుతున్నామన్నారు. ఇతర రాష్ట్రాల వారు తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జెడ్పీటీసీలు రమాదేవి, లక్ష్మారెడ్డి, తీగల తిర్మల్ గౌడ్, మిన్కూరి రాంరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీలు పిప్పిరి ఆంజనేయులు, గాల్ రెడ్డి, బాలమణి, శారద, మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, అధికార ప్రతినిధి బల్వంత్‌రావు, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, నల్లవెల్లి అశోక్, టీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మోసం చేసిన మద్యం సీసా..

- ‘వైన్ గ్రూప్’ సంస్థ పేరుతో బురిడీ
- జిల్లాలో వందల సంఖ్యలో బాధితులు
- రూ. కోట్లలో టోకరా
- వెలుగు చూసిన కొత్త మోసం

కామారెడ్డి క్రైం : తమ వైన్ బాటిల్ కంపెనీలో సభ్యులుగా చేరి పెట్టుబడులు పెడితే 60 రోజుల్లో మూడింతలు చెల్లిస్తామని, రోజువారీగా అకౌంట్‌లో డబ్బులు వేస్తామని నమ్మించిన ‘వైన్ గ్రూప్’ కంపెనీ రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది డబ్బులు కాజేసినట్లు ఆరోపణలు వెలువడుతున్న విషయం తెలిసిందే. రూ. 470 నుంచి మొదలు పెడితే రూ. లక్షల్లో పెట్టుబడులు పెట్టుకునే విధంగా కంపెనీ ప్యాకేజీలను ప్రకటించి జనాన్ని ఆన్‌లైన్, వాట్సప్ గ్రూపుల ద్వారా ఆకర్షించింది. కంపెనీలో సభ్యుడిగా చేరిన వారు మరో 230 మందిని సభ్యులుగా చేర్పిస్తే నెలకు రూ. 20 వేలు జీతం ఇస్తామని, రూ. 85 వేలు పెట్టుబడి పెడితే ప్రతి రోజు రూ. 12 వేలు చొప్పున అకౌంట్లో వేస్తామని, రకరకాలుగా డబ్బు లు వేసే ప్యాకేజీలను చూపించి నమ్మించారు. కొద్ది రోజులు సక్రమంగానే డబ్బులు వేశారు. మే 31వ తేదీవరకు సభ్యులుగా చేరిన వారి అకౌంట్లలో ప్రతిరోజు డబ్బులు జమయ్యాయి. ఆ తర్వాత ఒక్కసారిగాలావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో నష్టపోయామని గుర్తించిన బాధితులు లబోదిబోమంటున్నారు.

బీర్షబా సంస్థ లాంటి మోసం..

కామారెడ్డి జిల్లాలో కూడా వైన్ బాటిల్ కంపెనీ బాధితులు వేల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. కేవలం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి ప్రాంతం నుంచే ఈ కంపెనీలో సభ్యులుగా చేరి దాదాపు 100 మంది వరకు బాధితులు ఉన్నట్లు తెలుస్తుంది. దాదాపు రూ. 50 నుంచి రూ. 60 లక్షల వరకు నష్టపోయినట్లు చెబుతున్నారు. జీవదాన్ ఆస్పత్రి ప్రాంతంలో ఉండే ఓ వ్యక్తి ఒక్కడే రూ. 4 లక్షల వరకు పెట్టుబడి పెట్టి మరికొంత మందిని సభ్యులుగా చేర్పించాడు. అతనికి కొద్ది రోజులు రోజువారి డబ్బులు వచ్చినప్పటికి పెట్టిన పెట్టుబడిలో సగం వరకు నష్టం జరిగినట్లు తెలిసింది. అంతేకాకుండా చుట్టు పక్కల గ్రామాల వారు కూడా అనేక మంది సదరు కంపెనీలో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తుంది. సదరు కంపెనీ వ్యవహారాలు, లావాదేవీలు అనేక జిల్లాల్లో వ్యాపించి ఉన్నాయి. బాధితులు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారు. గతంలోనూ బీర్షబా లాంటి అనేక కంపెనీలు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని రూ. కోట్లలో కుచ్చు టోపీ వేసి ఉడాయించిన ఘటనలు అనేకం. పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు ఇలాంటి కంపెనీల ఆగడాలను, కార్యాకలపాలను అరికట్టడంలో వైఫల్యం చెందుతున్నారనే విమర్శలున్నాయి. తాజాగా వెలుగుచూసినా వైన్ బాటిల్ కంపెనీ వ్యవహారంపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.



సంస్థకు చెందిన యాప్ ముఖచిత్రం

పెరిగిన మద్దతు..!

2023–2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటలకు మద్దతు ధర (ఎంఎస్పీ)ను కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. పెరిగిన ధరలు రైతులకు కాస్త ఊరటనిస్తాయని భావిస్తున్నారు. వరితో పాటు పప్పు దినుసులు, సోయా, పత్తి, ఇతర అన్ని పంటలకు ధరలు పెంచారు.

- ఖరీఫ్ పంటల ఎంఎస్పీ ఖరారు
- వరి ధర క్వింటాలుపై రూ.143 పెంపు
- పెసర, నువ్వు పంటలకు అత్యధికంగా..
- రైతులకు కాస్త ఉపశమనం

సాక్షి, కామారెడ్డి : కేంద్ర ప్రభుత్వం వరి సాధారణ, ఏ గ్రేడ్ రకాలకు క్వింటాలుకు రూ.143 చొప్పున పెంచింది. గతేడాది సాధారణ ధాన్యం ధర రూ.2,040 ఉండగా, ఇప్పుడు రూ.2,183 కు చేరింది. అలాగే ఏ గ్రేడ్ రకం వడ్ల ధర రూ.2,060 ఉండగా, ఇప్పుడు రూ.2,203కు చేరింది. వీటితో పాటు మిగితా పంటలకు ధరలు భారీగా పెరిగాయి. ఖరీఫ్ సీజన్‌లో పండించే ఆయా పంటలకు పెరిగిన ధరలు వర్తిస్తాయి. వరితో పాటు పప్పు దినుసులు, సోయా, పత్తి, ఇతర అన్ని పంటలకు ధరలు కూడా పెరిగాయి. దీంతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. అయితే పంటల సాగుకు అవసరమైన పెట్టుబడులు భారీగా పెరగడం, తెగుళ్ల, అకాల వర్షాలతో దిగుబడులు తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చాలా మంది రైతులకు కనీసం పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. దీంతో అప్పులపాలయ్యారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం అందిస్తామని చెప్పినా, ఇప్పటికీ ఎలాంటి పరిహారం అందలేదు.

అరుతడి పంటలకు..

అరుతడి పంటల ధరలు ఎక్కువగా పెరిగాయి. పెసర, కందులు, మినుములు ధరలు పెరిగాయి. పత్తి ధర కూడా భాగానే పెరిగింది. 6,080 ఉండగా రూ. 540 పెంచారు. నువ్వుల ధర అత్యధికంగా పెరిగింది. ఇప్పటి వరకు క్వింటాలు నువ్వుల ధర రూ. 7,830 ఉండగా, రూ.805 పెంచారు. దీంతో నువ్వుల ధర రూ.8,635కి చేరింది. పొద్దు తిరుగుడు, సోయా, జొన్న పంటల ధరలు కూడా పెరిగాయి.



పంట	గత ఏడాది ధర (రూ.)	పెంపుదల (రూ)	పెరిగిన ధర (రూ)
వరి (సాధారణ)	2,040	143	2,183
వరి (ఏ గ్రేడ్)	2,060	143	2,203
మక్క	1,962	128	2,090
పెసర	7,755	803	8,558
కందులు	6,600	400	7,000
సోయా	4,300	300	4,600
పత్తి	6,080	540	6,620
జొన్న (హైబ్రిడ్)	2,990	210	3,180
జొన్న (మల్దండి)	2,990	235	3,225
మినుము	6,600	350	6,950
పొద్దు తిరుగుడు	6,400	360	6,760
నువ్వులు	7,830	805	8,635

పగలైనా వైద్యుల జాడ కరువు

- జిల్లా కేంద్రంలోని పశు వైద్యశాలలో ఇష్టారాజ్యం
- మూగజీవాల రోదన పట్టని వైనం



జిల్లా కేంద్రంలో మూసి ఉన్న పశువైద్యశాల



వేచి చూస్తున్న మూగజీవాల యజమానులు

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో ఉన్న పశు వైద్యశాల వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 11 గంటలకు దాటితే గాని ఆస్పత్రికి రావడం లేరని మూగజీవాల యజమానులు వాపోతున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు కూడా ఆస్పత్రికి తాళం వేసి ఉంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు 20 మంది వరకు తమ పెంపుడు జంతువులు, పశువులను వైద్యం కోసం తీసుకొచ్చి వేచి ఉన్నారు. సీరియస్ ఉన్న మూగజీవాలను కొందరు మధ్యాహ్నం వరకు వేచి ఉండి ఇతర ఆస్పత్రులకు తీసుకెళ్లారు. పెంపుడు కుక్కలు, గొర్రెలు, కోళ్లు, ఆవులు, గేదెలు యజమానులు వాటి వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చి వైద్యం అందక తిరిగి వెళ్లిపోతున్నారు. మూగజీవాలను తీసుకుని వైద్యం అందక తిరిగివెళ్లిపోవడంవ్యయప్రయాసలతో కూడుకున్నదని, ఆస్పత్రిలో మందులు కూడా సరిగ్గా లేవని మూగజీవాల యజమానులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రతిరోజు ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని, మూగజీవాలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందేలా చేయాలని కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో మిగిలిన ఇంటర్ ప్రథమ సంవత్సరం సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ జిల్లా సమన్వయకర్త సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు www. tswreis. ac. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫీజు రూ.100 చెల్లించి, ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో పొందిన జీపీఏ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారని తెలిపారు.

స్వయం ఉపాధి శిక్షణకు..

డిచ్‌పల్లి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) డిచ్‌పల్లి, ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ రిపేర్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సుల్లో 30రోజుల ఉచిత శిక్షణతోపాటు ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ధృవీకరణపత్రం అందిస్తారని తెలిపారు. 19–40 వయస్సు కలిగి ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, 10వ తరగతి ధృవీకరణ పత్రాలతో పాటు ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 8 నుంచి సెల్‌ఫోన్ రిపేర్ శిక్షణ తరగతులు, 12 నుంచి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు ఎస్‌బీఐ శిక్షణ కేంద్రం, డిచ్‌పల్లిలో, లేదా ఫోన్ నెంబర్ 08461–295428ను సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి



మానవత సదన్ పిల్లలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

డిచ్‌పల్లి: వానాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పిల్లలు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుదర్శనం సూచించారు. మండల కేంద్రంలోని మానవత సదన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ప్రతి నెలా పిల్లలకు మందులు అందుతున్నాయా లేదా అని వారి ఆరోగ్య విషయాలను కేర్‌టేకర్ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలో సదన్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో సదన్ పిల్లల నృత్యప్రదర్శన చాలా బాగున్నాయని అభినందించారు.







జవాన్‌లను ఆదుకున్న దేశభక్తుడు కేసీఆర్

- డివిజన్‌లలో సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- నగరంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్‌నాగారం: జై జవాన్.. జై కిసాన్.. అని అందరూ నినాదాలు చేస్తుంటారు. కానీ నినాదాలతోపాటు జవాన్లను, రైతులను ఆదుకున్న నిజమైన దేశభక్తుడు సీఎం కేసీఆర్ అని, పక్కా రాష్ట్రాల జవాన్‌లను సైతం ఆదుకున్నాడని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ విజయలక్ష్మీగార్డెన్‌లో బుధవారం 6, 21, 22, 23, 24, 45 డివిజన్ పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కవిత హాజరై మాట్లాడారు. జై జవాన్.. జై కిసాన్.. నినాదంలో భాగంగా రాష్ట్రంలో 65లక్షల రైతులకు రూ. 60వేల కోట్ల నిధులతో ఆదుకున్నామన్నారు. అలాగే పక్క రాష్ట్రాలలో మృతిచెందిన జవాన్ల కుటుంబాలను ఆదుకున్నామన్నారు. నిజామాబాద్‌లో అన్ని పార్టీలు గులాబీ కండువా కప్పుకోవాల్సిందేన్నారు. అర్బన్‌లో బిగాల వినాయకుడిలా రాష్ట్రంలో తొలి విజయం అందుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు 100శాతం గులాబీమయమే అన్నారు. నగరంలో ఆయా డివిజన్‌లల్లో సోషల్ మీడియా గ్రూపులు పెట్టుకోవాలని, బీజేపీ, కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలకు నిజాలు చెప్పాలని అన్నారు.

ఎంపీగా కవితను భారీ మెజార్టీతో గెలిపిద్దాం..

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను వచ్చే ఎన్నికల్లో ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపిద్దామని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా తెలిపారు. మూడోసారీ రాష్ట్రంలో గులాబి జెండా ఎగురవేయాలన్నారు. నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. మేయర్ నీతూకిరణ్, ఉమెన్ వెల్ఫేర్ ఛైర్మన్ ఆకుల లలిత, సుడా ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ రెడ్కో ఛైర్మన్ ఎస్ఎ అలీం, నాయకులు సుజిత్‌సింగ్, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

పాండురంగ ఆలయంలో పూజలు



మాక్లూర్: మండల కేంద్రంలోని రుక్మిణి పాండురంగ విఠలేశ్వర, అయ్యప్ప, ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, అతని సోదరుడు మహేష్‌గుప్తాలు ఈ ఆలయాన్ని పునఃనిర్మించి, ఇటీవల ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి అప్పట్లో కవితను ఆహ్వానించినప్పటికీ అనివార్య కారణాలవల్ల ఆమె రాలేకపోయారు. దీంతో బుధవారం సమయం కలిసి రావటంతో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి, మేయర్ నీతూకిరణ్‌లతో కలిసి మాక్లూర్‌కు చేరుకొని ఆలయంలో పూజలు చేశారు. ఎంపీపీ మాస్త ప్రభాకర్, నాయకులు సత్యం, మల్లారెడ్డి, రంజిత్, అశోక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవీపేట: మండలంలోని జన్నెపల్లి గ్రామానికి చెందిన క్యామాజి లలితమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకుని ఓదార్చారు.

మంత్రి గారూ..! పేద కుటుంబాన్ని ఆదుకోండి!



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి కుటుంబాన్ని ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం అతలాకుతలం చేసింది. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో ముగ్గురు కుమార్తెల భవిష్యత్ అంధకారమైంది. దీంతో నిరుపేద లక్ష్మి కుటుంబాన్ని ఆర్అండ్‌బీశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదుకోవాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మామిడిరాజు, అంగుళి మాలాజి, దేవా పద్మారావు, సత్యనారాయణ కోరారు. ఈమేరకు వారు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ.. లక్ష్మీ భర్త కొంతం రవికుమార్ (44) ఉపాధి కోసం మూడేళ్ల గల్ఫ్‌కు వెళ్లి, పరిస్థితి అనుకూలించక ఇటీవల ఇంటికి వచ్చాడన్నారు. గత నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడన్నారు. ఆ సమయంలో అతడి జేబులో రూ. 50వేలు విలువగల గల్ఫ్ కరెన్సీ నోట్లు ఉండగా, వాటిని దొంగలించారన్నారు. ప్రస్తుతం డిగ్రీ, ఇంటర్మీడియట్, ఎస్సెస్సీ చదువుతున్న రవికుమార్ కుమార్తెల చదువు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి స్పందించి రవి కుమార్తెలకు ఉచితంగా చదువు చెప్పించాలని, దళితబంధు పథకం ద్వారా ఆ కుటుంబానికి ఆసరా కల్పించాలని కోరారు.

అన్నదాతల అభివృద్ధికి పెద్దపీట



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

వర్ని: రాష్ట్రంలో అన్నదాతల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మండలంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ వద్ద బుధవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. రైతు అభివృద్ధిలో భాగంగానే పంటకు పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి రూ.10వేలు, సబ్సిడీపై విత్తనాల అందజేత, ధాన్యం కొనుగోలు, దళారి వ్యవస్థకు అడ్డుకట్టలు వేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగం, సాగునీటి ప్రాజెక్టులు, రైతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ, కృషి చేస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో సాగునీటి నిల్వలు పెంచడానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని పంపింగ్ చేస్తూ రాష్ట్రం నలుమూలల సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. సిద్ధాపూర్ ప్రాంతంలో సాగునీటి ఎద్దడిని నివారించేందుకు రూ.32కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు సిద్ధమవుతున్నాయని, దీనిని బట్టి చూస్తే దేశానికి రాష్ట్రం మోడల్‌గా తయారయిందని అన్నారు. జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్, వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు, జెడ్పీటీసీ హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారంపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్

నిజామాబాద్‌నాగారం: అపరిశుభ్రత, కలుషిత ఆహారం వల్లే కలిగే అనార్థాలను ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయావర్ రాజేశ్వర్ పేర్కొన్నారు. నగరంలోని గాంధీగంజ్‌లో బుధవారం జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారి నాయక్ అధ్యక్షతన 'ప్రపంచ ఆహార భద్రత పరిరక్షణ దినోత్సవం' నిర్వహించారు. ఈసందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఆహార పదార్థాలను కల్తీ చేసే వారిపై ప్రభుత్వం ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.లక్ష వరకు జరిమానా విధించడానికి వీలుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాలకు కేటాయించిన ఫుడ్ సేఫ్టీ వ్యాన్ నిజామాబాద్ జిల్లాకు వచ్చిందని, ఎక్కడైనా కల్తీ జరిగితే దీంతో పరీక్ష చేయించుకోవచ్చన్నారు. కామారెడ్డి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, మాజీ కార్పొరేటర్ వల్లభ, శ్యామ్ తివారి, రంజిత్, శేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కొద్దిరోజులుగా తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారం కొనసాగింది. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఎదుట 'ఓన్లీ స్లోగన్స్ టుడే' నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మా ఆవేదనను అర్జీ రూపంలో స్వీకరించి అతి తొందరలోనే మాకు శుభవార్త తెలియజేస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న 1,335 మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసే వరకు నిరసనలు కొనసాగుతాయన్నారు.

దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి

సుభాష్‌నగర్: దివ్యాంగులకు పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని వీహెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పాల్గొని, మాట్లాడారు. ఈ సమాజంలో దివ్యాంగులు ప్రతి నిత్యం వివక్షకు గురవుతున్నారని, కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి, మర్చిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను నెరవేర్చాలన్నారు.

కోలుకుంటున్న 'కోడి'

- ధర పెరగడంతో నష్టాల నుంచి బయట పడుతున్న పౌల్ట్రీ రైతులు



కోళ్ల ఫారంలో పెరుగుతున్న కోళ్లు

బీబీపేట: ఆరు నెలలుగా నష్టాల్లో కూరుకుపోయిన పౌల్ట్రీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుంది. ప్రస్తుతం చికెన్ ధరలు పెరగడంతో పౌల్ట్రీ రైతులు నష్టాల నుంచి బయటపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ రంగం తర్వాత రెండో అతిపెద్దదిగా పౌల్ట్రీ రంగం అని చెప్పవచ్చు. జిల్లా వ్యాప్తంగా సుమారు 32 లక్షల బాయిలర్ కోళ్ల సామర్థ్యం, 6 లక్షలకు పైగా లేయర్ కోళ్ల సామర్థ్యం కలిగిన ఫారాలు ఉన్నాయి. జిల్లా నుంచి రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా ఇతర రాష్ట్రాలకు సైతం కోళ్లను ఎగుమతులు చేస్తూ ఎక్కువ మొత్తంలో లావాదేవీలను జరుపుతున్నారు. అలాగే పౌల్ట్రీ రైతులు చాలా మంది ప్రయివేటు ఇంటిగ్రేటెడ్ కంపెనీల కోళ్ల దింపుకొని వారి భాగస్వామ్యంతో పౌల్ట్రీలు నడుపుతున్నారు.

కొన్నేళ్లుగా ప్రతికూల పరిస్థితులు..

కొన్నేళ్లుగా పౌల్ట్రీ పరిశ్రమను ప్రతికూల పరిస్థితులు చుట్టుముడుతున్నాయి. సొంత పరిశ్రమలో ఒక్కో కోడి ఉత్పత్తి చేయడానికి అన్నీ కలుపుకొని రూ. 180 వరకు పైగా ఖర్చవుతుంది. రెండు కిలోల పైగా బరువుండే లైవ్ బర్డ్స్ కిలో ధర రూ. 180కి పైగా పలికితే నష్టాలు ఉండవు. కానీ ధరలో నిలకడ లేక పౌల్ట్రీ రైతులు ఆందోళనలో ఉన్నారు. ఆరు నెలలుగా లైవ్ బర్డ్ ధర కిలోకు రూ. 65–85 మాత్రమే పలికింది. బుధవారం మార్కెట్‌లో లైవ్‌బర్డ్ ధర కిలో రూ. 151 ఉండగా, కంపెనీలు రైతుల వద్ద లైవ్‌బర్డ్‌ను కిలోకు రూ. 136కి ధర చెల్లిస్తున్నారు. మరో వైపు దాణా ధరలు సైతం ఏటా పెరుగుతుండటం కూడా రైతులను కుంగదీస్తున్నది. గతేడాది కిలోకు రూ. 37 పలికిన దాణా ధర ప్రస్తుతానికి రూ. 43కు పెరగటం వల్ల రైతులకు భారంగా మారుతోంది.

దళారులకే లాభం..

కోళ్లను దించిన నుంచి వాటిని పెద్ద చేసి అమ్మేవరకు సేవ చేసినప్పటికీ అమ్మేవారు, కొనేవారు కన్నా మధ్యలో ఉండే వాళ్లకే లాభం చేకూరుతుంది. కోళ్ల ఫారాల రైతులు 45 రోజులకు పైగా కోళ్లను పెంచగా, విక్రయించేటప్పుడు మాత్రం మాత్రం ధరల లేకపోవడం, ఉన్న ధరను సైతం కంపెనీలు తక్కువకు కొనుగోలు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా వెనకబడిపోతున్నారు. అంతేకాకుండా ఇంటిగ్రేషన్ కంపెనీకి మార్కెట్ ధరకు మధ్యలో దళారులు తయారై లైవ్‌బర్డ్ ధరను రూ. 13–16 వరకు మైనస్‌లో అడుగుతున్నారు. చేసేదేమి లేక రైతులు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో రైతులకు మిగులుతున్నది అంతంతే. ప్రస్తుతం ఉన్న ధరలే కొనసాగితే పౌల్ట్రీ రైతులకు కొంతవరకు అయినా లాభం కలుగుతుంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బషీరాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ 1997-98 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆనాడు పాఠశాలలో గడిపిన స్మృతులను గుర్తు చేసుకున్నారు. రోజంతా సరదా కబుర్లు చెప్పుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేశారు.

క్రైం కార్నర్

డీసీఎంను ఢీకొన్న ఆటో: పలువురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ రాజు

ఆర్మూర్‌టౌన్: ఆగిఉన్న డీసీఎం వ్యానును వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొనడంతో పలువురికి తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు తెలిపి న వివరాలు ఇలా.. బుధవారం మె ట్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు ఆటో వస్తుండగా, కోటార్మూర్ ఫ్లైఓవర్ వద్ద అదుపుతప్పి ఆగిఉన్న డీసీఎంను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ రాజుతోపాటు ఆటోలో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నలుగురికి స్వల్ప గాయలు కావడంతో ప్రథమ చికిత్స చేశారు. డ్రైవర్‌ను మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే మరో ప్రయాణికుడిని మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. డ్రైవర్ తాగి ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు.

స్తంభాన్ని ఢీకొన్న బైక్: ఇద్దరికి గాయాలు

వర్ని: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గండిపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గండిపేట్‌కు చెందిన శివ, రాములు ఇద్దరు బైక్‌పై వర్ని వస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తులను, స్థానికులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఎల్ఐసీ బోనస్ పేరిట సైబర్ మోసం

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఓ వ్యక్తికి ఎల్ఐసీ బోనస్ వేస్తామంటూ, అతడి ఖాతా నుంచి సైబర్ మోసగాళ్లు నగదును అపహరించిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డి గ్రామానికి చెందిన లాగాల నాగరాజుకు ఈనెల 6న ఎల్ఐసీ ఏజెంట్ పేరుతో ఫోన్‌కాల్ వచ్చింది. మీ అకౌంట్‌లో పాలసీ బోనస్ డబ్బును ఫోన్‌పేలో జమ చేస్తామని సదరు ఏజెంట్ పేర్కొన్నాడు. దీంతో నాగరాజు సదరు ఏజెంట్ పంపిన కోడ్‌ను ఓకే చేశాడు. వెంటనే అతడి ఖాతా నుంచి 4 విడతల్లో రూ.24వేల 570 చొప్పున మొత్తంగా రూ.98,250 విత్‌డ్రా అయ్యాయి. దీంతో మోసపోయానని గ్రహించిన నాగరాజు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఏఎస్సై సుభాషిని తెలిపారు. ఎల్ఐసీ బ్రాంచ్ నుంచి ఏజెంట్ల నుంచి కేవైసీ కోసం మాత్రమే ఫోన్లు వస్తాయని, వ్యక్తిగత సమాచారం, కోడ్ పంపి ఓకే చేయమని అడగరని ఏజెంట్ ఆకుల ఉమాపతి తెలిపారు.


వివాహిత అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని దమన్నపేట గ్రామానికి చెందిన వివాహిత ఓస సుశీల(35) అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 6న సుశీల ఆస్పత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. ఇప్పటికీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె తండ్రి సాయన్న ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కామారెడ్డి మండలంలో ఒకరు..

కామారెడ్డి క్రైం: మేస్త్రీ వద్ద కూలీపని చేసేందుకు వచ్చిన ఓ బీహార్ వాసి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ బుధవారం తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాత రాజంపేటలో నివాసం ఉండే పసుపులేటి శ్రీనివాస్ మేస్త్రీగా పని చేస్తాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన 10 మంది కూలీలు పనులు చేసేందుకు ఇటీవల అతని వద్దకు వచ్చారు. వారిలో ఫకీర్ చంద్ర అనే 42ఏళ్ల కూలీ ఈ నెల 2న రాత్రి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో మేస్త్రీ శ్రీనివాస్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదెల మృతి



మోర్తాడ్: మేతకు వెళ్లిన రెండు గేదెలు విద్యుత్ షాక్ తగలడంతో బుధవారం మృతి చెందాయి. మోర్తాడ్‌కు చెందిన కుర్మ మహేందర్‌కు చెందిన గేదెలు మేత మేస్తుండగా.. తెగిపడిన విద్యుత్ తీగెలు కాలుకు తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాయి. గేదెల మృతితో పాడి రైతుకు రూ.80వేల నష్టం వాటిల్లింది.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



గుండ్ల రాజు (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భార్య కాపురానికి రావడం లేదనే కారణంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బొల్లారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బొల్లారం గ్రామానికి చెందిన గుండ్ల రాజు(33)కు పర్మళ్ల గ్రామానికి చెందిన రక్షణతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక బాబు ఉన్నాడు. ఇటీవల వారి కుటుంబంలో గొడవలు జరగడంతో కారణంగా రక్షణ తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో రాజు మంగళవారం పర్మళ్లకు వెళ్లి తన భార్యను కాపురానికి పంపాలని పెద్దల సమక్షంలో మాట్లాడారు. తనకు ప్రస్తుతం ఆరోగ్యం బాగాలేదని, కుదుటపడ్డాకా వస్తానని రక్షణ చెప్పడంతో రాజు బొల్లారం వచ్చేశాడు. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్ చోరీ

ఎల్లారెడ్డి: మండలంలోని కళ్యాణి ప్రాజెక్టు సమీపంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దుండగులు ఆయిల్‌ను చోరీ చేసినట్లు రైతులు బుధవారం తెలిపారు. ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా కళ్యాణి ప్రాజెక్టు శివారులో గల 100, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దుండగులు ఆయిల్‌ను చోరి చేసినట్లు తెలిపారు. పోలీసులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ఆయిల్ చోరీ జరగకుండా తగిన చర్యలను తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆలయాల్లో ..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పలు ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బ్రహ్మంగారి గుట్ట వద్ద గల జంబి హన్మాన్ ఆలయం, రామాలయం, వాసవీమాత ఆలయం, గుట్టపై గల పలు ఆలయాల తాళాలు పగులగొట్టి చిన్నచిన్న వస్తువులు చోరీకి పాల్పడ్డారు. హన్మాన్ ఆలయంలో 5 లీటర్ల దీపం నూనే, రామాలయంలో దేవతా మూర్తుల వస్త్రాలు, వాసవీ మాత ఆలయంలో పూజా సామగ్రి వస్తువులను ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం దర్శనానికి వెళ్లిన భక్తులకు ఆలయాల తలుపులు తెరిచి ఉండడంతో చోరీ ఘటన వెలుగు చూసింది. పోలీసులకు సమాచారం అందించామని భక్తులు తెలిపారు.

తొమ్మిది మంది రిమాండ్

ఇందల్వాయి: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలో దళిత యువకుడు కర్దూరం నందుని వేధించిన కేసులో గ్రామానికి చెందిన 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ బుధవారం తెలిపారు. నందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రధాన నిందితులు 9మందిని మంగళవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.